క్లుప్తంగా

హిందూ ధర్మాన్ని సంరక్షించుకోవాలి

మిడుతూరు: సనాతన హిందూ ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని సంరక్షించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. సోమవారం తలముడిపి గ్రామంలో భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పుల్లారెడ్డి, గోకారి, ఆచారి, నాగమద్దిలేటి, హైమావతి పాల్గొన్నారు.

దైవ చింతనతో ప్రపంచ శాంతి


ఆశ్రమంలో శ్రీకాశి జగద్గురు మల్లికార్జున స్వామి

పాములపాడు: ప్రజలందరూ దైవచింతనతో ఉంటే ప్రపంచమంతా శాంతియుతంగా ఉంటుందని శ్రీ కాశి జగద్గురు మల్లికార్జున స్వామి అన్నారు. సోమవారం మండలంలోని జూటూరు గ్రామంలోని నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమాన్ని దర్శించారు. స్వామి వారిని నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమ పీఠాధిపతి సద్గురు రామానంద స్వామి స్వాగతం పలికి పాదపూజ చేశారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆశీర్వాదాలు ఇచ్చి గీతలో శ్రీకృష్ణుడు బోధించిన పలు విషయాలను వివరించారు.

అన్నదాన పథకానికి విరాళాలు


విరాళాన్ని అందించిన నెల్లూరుకు చెందిన శివాసుదేవసింగ్‌ను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందించారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన వేమన చెంచు మురళీ దంపతులు రూ.1,00,116, నెల్లూరుకు చెందిన వై.శివవాసుదేవసింగ్ కుటుంబ సభ్యులు రూ.1,00,116, పుట్టపర్తికి చెందిన పి.శ్రావణి దంపతులు రూ.1,01,116, సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ సురేష్ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావుకు అందించారు. దాతలకు దేవస్థానం తరుపున అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

క్రీడాకారులకు అభినందన

పాములపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన పాములపాడు జట్టును వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు హనుమంతు అభినందించారు. సోమవారం మండల కేంద్రంలో క్రీడాకారులను సత్కరించారు. భవిష్యత్తులో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుంటామని చెప్పారు.

పెద్దపులి హల్‌చల్

కొత్తపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలోని జనాల గూడెం, బలపాలతిప్ప గ్రామాల శివారుల్లో రెండు రోజుల నుంచి పెద్దపులి హల్‌చేస్తోంది. రాత్రి వేళల్లో గ్రామాల సమీపానికి వస్తుండడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం జనాలగూడెంకు గ్రామస్తులు సుధాకర్, వెంకటరమణ పులిని కళ్లార చూశామని విలేకరులకు తెలిపారు. గత రెండురోజుల నుంచి గ్రామాల సమీపంలో రోడ్డుపై పెద్దపులి అడ్డంగా పడుకొని ఉంటోందని, దీంతో గ్రామాల్లోకి వస్తుందేమోనని భయాందోళకు గురవుతున్నామన్నారు. ఈ విషయంపై ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభిని సంప్రదించగా గ్రామాలు అటవీ ప్రాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయని, కృష్ణానదికి నీరు తాగేందుకు మూగజీవాలు, పులులు వస్తుంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆపరిసర ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ్రామాల సమీపంలో పులి జాడకనిపిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

తెలుగుగంగ 11వ బ్లాక్‌లో పూడికతీత


11వ బ్లాక్‌లో పూడికతీత పనులు చేయిస్తున్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి

మహానంది: తెలుగు గంగ ప్రధాన కాల్వ 11వ బ్లాక్ వద్ద పూడికతీత పనులు చేయించినట్లు మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వర్‌రెడ్డి తెలిపారు. తమ్మడపల్లె రైతులతో కలిసి సోమవారం కాల్వ వద్దకు చేరుకుని జేసీబీతో పనులు చేయించారు. ఈ మేరకు చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 11వ బ్లాక్ ద్వారా 2,500 ఎకరాల పంటలకు సాగునీరు అందుతుందని చెప్పారు. కాలువ వెంట మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించినట్లు చెప్పారు. దీని ద్వారా తమ్మడపల్లె, నందిపల్లె గ్రామ రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం


తూర్పుప్రాతకోట నాగేశ్వరస్వామి రథోత్సంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి


తరిగోపులలో రథం ముందు కామదహనం చేస్తున్న దృశ్యం

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాలలో ఆదివారం నిర్వహించిన నాగేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి రథోత్సవ వేడుకలు రమణీయంగా సాగాయి. కార్యక్రమానికి రాష్ట శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి హాజరై నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామిలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. రథోత్సవంలో కళాకారుల దశావతార, దుర్గాదేవి, నరసింహస్వామి, నందీశ్వర, రాక్షసుల వేషధారణలలో నంద్యాల కళాకారులు నృత్యం చేస్తూ భక్తుల్లో ఉత్తేజాన్ని నింపారు. వేడుకల్లో అల్లర్లు చోటుచేసుకోకుండా నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ నాగార్జున బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, మండల కోఆప్షన్ మెంబర్ అస్లాంబాషా, సొసైటీ డైరెక్టర్ దివాన్ సాహెబ్, సర్పంచ్ శేషమ్మ, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తిరునాల సందర్భంగా ఆర్కెస్ట్రా, రేలా రేలారే నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వకపోవడంపై తూర్పు ప్రాతకోట గ్రామస్తులు రథం లాగకుండా గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

పడమర ప్రాతకోటలోని నందీశ్వర, కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో 4 పళ్ల, న్యూ కేటగిరి విభాగాల బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు మొమిన్ మన్సూర్, పగిడ్యాల మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి ప్రారంభించారు. అలాగే వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలలో ప్రాతకోట జట్టు మొదటి స్థానం, మండ్ల రాజశేఖర్(ఆర్మీ) రెండవ విజేతగా, మూడవ విజేతగా పసుల సాయికుమార్, చికెన్ మౌలాలి జట్టు, నాల్గవ విజేత వాల్మీకి యూత్ ప్రాతకోట నిలిచినట్లు నిర్వాహకులు శ్రీకాంత్ వెల్లడి చేశారు.

ఉత్కంఠభరితంగా పొట్టేళ్ల పందెం

మండలంలోని పడమర ప్రాతకోట నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. చెరుకుచెర్ల వంశీ పొట్టేలు విజేతగా నిలిచి రూ. 6 వేల బహుమతిని గెలుచుకుంది. మండ్లెం పొట్టేలు రెండవ స్థానంలో రూ. 4 వేలను దక్కించుకుంది. ప్రాతకోట రమేష్ పొట్టేలు మూడో స్థానంలో నిలిచి రూ. 2 వేలు, నాగటూరు చాకలి మహేష్ పొట్టేలు చివరి స్థానం కైవసం చేసుకోగా కమిటీ నిర్వాహకులు రూ. 1000లు నగదును ప్రోత్సాహకంగా ఇవ్వడం విశేషం.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీఅనంత నాగేశ్వరస్వామివార్ల రథోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి రథంపై కూర్చొండబెట్టారు. అర్చకులు వేదమంత్రాలను పఠిస్తుండగా రథం ముందు కామదహనం చేసి, బలిహారతి వేడుకను ప్రారంభించారు. ఈఓ వెంకటరమణ, కర్నూలు జిల్లా కోర్టు పీపీ వెంకటరెడ్డి స్వామివార్లను దర్శించుకొని రథోత్సవంలో పాల్గొన్నారు. సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సుజాత, ఆలయ ధర్మకర్త చిన్న కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, జయశేఖరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎలమరాజు, అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పార్వేట


బండిఆత్మకూరులో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

బండిఆత్మకూరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ గ్రామాల్లో పార్వేట ఉత్సవాన్ని సోమవారం కనుల పండుగగా నిర్వహించారు. బండిఆత్మకూరు, పార్నపల్లె, సంతజూటూరు, ఏ.కోడూరు, సింగవరం గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలకు మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. బండిఆత్మకూరులో లక్ష్మీజనార్దన స్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళ తాళాల మధ్య గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. అనంతరం పారువేట కార్యక్రమంలో భాగంగా గొర్రె తోకను కోసి దానిని పట్టుకున్న వారికి విజేతగా ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండగ

బండిఆత్మకూరు: సంక్రాంతి వేడుకల్లో భాగంగా బండిఆత్మకూరు ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కొత్త ధాన్యంతో నైవేద్యాన్ని తయారు చేసి, బోనాలలో ఊరేగింపుగా గ్రామంలోని చౌడమ్మ దేవాలయం చేరుకున్నారు. అక్కడి నుంచి కుందూనది అవతలివైపు ఉన్న సుంకులమ్మ ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కృష్ణానదిలో బోట్లు తిప్పితే సీజ్ చేస్తాం


మూర్వకొండ ఘాట్ వద్ద మత్స్యకారులకు సూచనలిస్తున్న రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి

పగిడ్యాల: కృష్ణానదిలో బోట్లు తిప్పితే సీజ్ చేస్తామని నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ముచ్చుమర్రి స్టేషన్ పరిధిలోని మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌లను సోమవారం సందర్శించారు. ఘాట్ నిర్వాహకులు, మత్స్యకారులతో మాట్లాడారు. ఈనెల 18న సింగోటం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవ వేడుకలకు ఇంజిన్ బోట్లలో భక్తులను తరలించేందుకు ప్రభుత్వ అనుమతి లేదని స్పష్టం చేశారు. నదిలోకి చేపలు పట్టేందుకు మత్స్యకారులు వెళ్లరాదని ఐస్ బాక్స్‌లు, చేపల తరలింపు కోసమని బోట్లు తిప్పితే అన్నిటినీ సీజ్ చేసి బాధ్యులను జైలుకు పంపుతామన్నారు. అర్లపాడు, మూర్వకొండ ఘాట్‌ల ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సీఐ వెంట స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ షేక్షావలి, వీఆర్వోలు వెంకటస్వామి, మద్దిలేటి, కానిస్టేబుల్ ఈశ్వర్, ముస్తఫా తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


నారాయణాపురంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


శ్రీశైలంలో ముగ్గుల పోటీ విజేత జిల్లెల లక్ష్మీదేవికి బహుమతి అందజేస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలో నిర్వహించిన ఈ పోటీలలో స్థానికులే కాకుండా కర్నూలు, విజయవాడకు చెందిన మొత్తం 18 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీలకు దేవస్థానం పర్యవేక్షకులు కె.సాయికుమారి, పి.దేవిక, రికార్డు అసిస్టెంట్ ఎం.సావిత్రి పర్యవేక్షకులుగా వ్యవహరించారు పోటీలలో జిల్లెల లక్ష్మీదేవి మొదటి బహుమతి, అపర్ణ రెండవ బహుమతి, రోజారాణి మూడవ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో హరిదాసు, డీఈఈ నరసింహారెడ్డి, శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్. సి.అనిల్‌కుమార్, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు అయ్యన్న పాల్గొన్నారు.

బండిఆత్మకూరు:సంక్రాంతి పర్వదినాన్ని పరుస్కరించుకొని నారాయణాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌడుగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. వివిధ రకాల ముగ్గులను వేసి మహిళలు తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి విజయగౌరి, ఉపాధ్యాయురాలు లక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

ఎదురుపాడు గ్రామంలో

కొత్తపల్లి: మండలంలోని కొక్కెరంచ సచివాలయంలో పరిధిలోని నాగంపల్లి గ్రామంలో గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. విజేతలకు ఉపసర్పంచు కరిముల్లా, వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు రామలింగారెడ్డి, గ్రామపెద్దలు వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రీనివాసులు, ఎం.వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వరరావుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కొత్తపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు చీరలు బహూకరించారు.

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచు మల్లీశ్వరరెడ్డి బహుమతులను అందజేశారు. అలాగే పోటీలో పాల్గొన్న మహిళలందరికి కన్సలేషన్ బహుమతులు అందజేశారు.

కమనీయం.. తాండవమల్లేశ్వర స్వామి కల్యాణం


స్వామివార్ల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని శ్రీపార్వతీసమేత తాండవమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణమహోత్సవం కనుల పండువగా జరిగింది. పురోహితులు యాదవేని లక్ష్మీనరసయ్య శర్మ, ఆలయ అర్చకులు మల్లికార్జున ఆచారి ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి బిందెసేవ, గణపతి పూజ, రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం రుద్రాభిషేకం వంటి విశేష పూజలు చేశారు. అనంతరం తాండవ మల్లేశ్వర స్వామిని పెళ్లికుమారునిగా ముస్తాబు చేశారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, సాయంకాల ప్రదోషపూజ నిర్వహించారు. రాత్రి 8.15 గంటల సమయంలో పార్వతిసమేత తాండవ మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు పురోహితులు వేదమంత్రాల నడుమ కల్యాణ తంతు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు.

వైభవంగా ప్రభోత్సవం

పార్వతీసమేత తాండవమల్లేశ్వరస్వామి తిరునాలలో భాగంగా సోమవారం స్వామివారి ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు యాదవేని లక్ష్మీనరసయ్య శర్మ, మల్లికార్జున ఆచారి, శీను ఆచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వార్లకు బిందెసేవ, అభిషేకం చేపట్టారు. సాయంత్రం స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రభపై కొలువుంచి గ్రామంలో ఊరేగించారు.

మహానందిలో వైభవంగా సంక్రాంతి మహోత్సవాలు


మహానందిలో సీతారాముల ఉత్సవం దృశ్యం

మహానంది: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మహానంది పుణ్యక్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా ఆది, సోమవారాల్లో విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు బృందం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, సంక్రమణ పూజలతో పాటు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు అభిషేకార్చనలు, తిరుమంజన సేవ వైభవంగా చేపట్టారు. అలాగే సోమవారం సాయంత్రం పార్వేట మహోత్సవం వైభవంగా జరిగింది. సీతాసమేత కోదండరాముల వారు ఆలయం నుంచి స్థానిక పర్యావరణ కేంద్రం వరకు గ్రామోత్సవంగా బయల్దేరి వెళ్లారు. అక్కడే పార్వేట ఉత్సవం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఈఓ ఎర్రమల మధు, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, బహుమతి దాతలు భవనాశి రమణయ్య, భవనాశి ఎల్లయ్య, సూపరింటిండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, శశిధర్‌రెడి పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు

రెండ్రోజుల పాటు గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహానందిలో ముగ్గుల పోటీల్లో విజేతలకు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారికి బహుమతులు అందించారు. తిమ్మాపురం గ్రామంలో పార్వేట ఉత్సవంలో మందా రాజేష్ గెలుపొందగా ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ బసిరెడ్డి నాగభూపాల్ రెడ్డి రూ. ఐదు వేల నగదు అందించారు.

యాత్రలు చేయవద్దని ఆంక్షలు లేవు

- మంత్రి కొట్టు సత్యనారాయణ
- రాష్ట్రంలో ఎవరికి, ఏ పార్టీకీ లేవు
- చంద్రబాబుతో పవన్ పొత్తు పెట్టుకోనిది ఎప్పుడు ?


మాట్లాడుతన్న మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీఓ నం.1 రాష్ట్ర ప్రజల సౌలభ్యం కోసమేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం మల్లన్న దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో యాత్రలు చేయవద్దని ఎవరికీ ఆంక్షలు పెట్టలేదని, ప్రతిపక్షంతో పాటు అధికార పక్షం కూడా ఎవైనా యాత్రలు, బహిరంగ సభలు, పాదయాత్రలు చేయాలంటే తప్పకుండా పోలీసు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఇది టీడీపీ, బీజేపీ, సీపీఎం, సీపీఐ, జనసేన, అధికార పార్టీకి కూడా వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండు దురదుష్టకరమైన సంఘటనలు జరిగాయని, అన్ని సంఘటనలు జరిగాక ప్రభుత్వం పట్టించుకోకపోవడం కరెక్టు కాదన్నారు. మా ప్రభుత్వం కూడా సభలు, సమావేశాలు పెట్టలన్నా అనుమతి తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వం ముందు చూపుతో ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. పవన్, చంద్రబాబు 2014 నుంచి కలిసే ఉన్నారన్నారు. వారి పొత్తు లేనిది ప్పుడు అని ప్రశ్నించారు?. 2014 నుంచి ఐదేళ్లలో ఎంతో అవినీతి జరిగితే ప్రశ్నించలేదని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అనుకుంటే.. దానికి విరుద్ధంగా ఆయన చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ఎవరి మద్దతు లేకుండా మేము ఎన్నికల్లో పాల్గొంటామని మంత్రి తెలిపారు.

రెండు ఆటోలు ఢీ.. ఒకరి మృతి

మహానంది: ఎదురెదురుగా వెళ్తున్న రెండు ఆటోలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి గోపవరం సమీపంలో చోటు చేసుకుంది. నంద్యాల మండలం పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి(42) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. తన ఆటోలో పాల క్యాన్లను తీసుకుని గాజులపల్లె వెళ్తుండగా గోడౌన్ల సమీపంలో నంద్యాల వైపు ఎదురుగా కూరగాయలతో వస్తున్న మరో ఆటో ఢీకొంది. ఈ ఘటనలో మహేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఆటోకు సంబంధించిన డ్రైవర్ పరారీలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. రోడ్‌సేఫ్టీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, మహానంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

మిడుతూరు: బనగానపల్లె బీసీ వసతిగృహంలో వంటమనిషిగా విధులు నిర్వహిస్తున్న ఇస్కాల గ్రామానికి చెందిన పెద్ద లింగస్వామి (32) 12వ తేదీన నందికొట్కూరుకు బంధువుల వద్దకు బైక్‌పై వస్తుండగా సుంకేసులబాట వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. గాయపడిన లింగస్వామిని చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందినట్లు ఎస్ఐ మారితిశంకర్ తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..


సీఈఓ డాక్టర్ హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శ్రీ పథకం సీఈఓ డాక్టర్ హరి ఇంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు సోమవారం మహానందిలో పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు.

పార్టీలకు అతీతంగా పోరాడాలి

జూపాడుబంగ్లా: సంగమేశ్వరం వద్ద బ్యారేజీ కం బ్రిడ్జి నిర్మాణం కోసం పార్టీలకు అతీతంగా పోరాడాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు కొండెపోగు చిన్నసుంకన్న, రవికుమార్‌రెడ్డి, మురళి, లాయర్ మధు పిలుపునిచ్చారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని పటేల్ విగ్రహం వద్ద రాయలసీమ ప్రజాప్రదర్శన పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 28న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు శివారెడ్డి, సురేష్, సాయి మహేష్, శ్రీకాంత్‌రావు, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

జూపాడుబంగ్లా: పొలం పనులకు వెళ్లే రైతులు, ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా పారుమంచాల–రోళ్లపాడు రోడ్డుకు పారుమంచాల సర్పంచ్ ప్రకాశం తన సొంత నిధులతో సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. సర్పంచ్‌తో పాటు 80 బన్నూరు సహకార సొసైటీ చైర్మన్ ఈదుల నారాయణరెడ్డి, రైతులు మూలింటి చెంచిరెడ్డి, శ్రీనివాసరెడ్డి లు ప్రొక్లెయిన్‌కు మరమ్మతు పనులు ప్రారంభించారు.


ప్రొక్లెయిన్ వద్ద సర్పంచ్, గ్రామ రైతులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- ఫిబ్రవరి 11 నుంచి 21 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ ఎస్.లవన్న


శివదీక్ష శిబిరాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: ఫిబ్రవరి 11 నుంచి 21 వరకు శ్రీశైలంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎస్.లవన్న తెలిపారు. సోమవారం ఇంజినీరింగ్, వసతి, పారిశుద్ధ్య విభాగ అధికారులతో కలిసి చంద్రవతి కల్యాణ మండపం, శివదీక్ష భక్తుల క్యూలైన్, శివదీక్ష శిబిరాలను పరిశీలించారు. చంద్రవతి కల్యాణ మండప ప్రాంగణంలోని శౌచాలయాలకు అవసరమైన మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. అంతరాయం లేకుండా శౌచాలయాలకు నిరంతరం నీటి సరఫరాకు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లోరింగ్‌కు అవసరమైన (బండ పరుపు) మరమ్మతులను చేపట్టాలని, ఆలయ ప్రాంగణంలో పచ్చదనాన్ని మరింతగా పెంపొందించాలని ఆదేశించారు. అనంతరం పాతాళగంగ మార్గంలోన శివదీక్ష శిబిరాలను పరిశీలించారు. గత సంవత్సరం కంటే ఎక్కువ విస్తీర్ణంలో పైప్ పెండాల్స్ వేయాలన్నారు. దీక్షా భక్తులు స్నానాలు ఆచరించేందుకు మరిన్ని కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు స్నానాలు ఆచరించేందుకు, దుస్తులు మార్చుకునేందుకు శివదీక్షా శిబిరాల వెనుకభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈఈ నరసింహారెడ్డి, వసతి విభాగం ఏఈఓ మోహన్, పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు అయ్యన్న, ఉద్యానవన అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత కొణిదేల


విజేతలకు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

వెలుగోడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. పోటీల్లో కొణిదేల జట్టు విజేతగా నిలువగా మొదటి బహుమతి రూ. 8,000ని దాతలు డి.షంషీర్ అలీ, ఎం. ఇలియాస్ ఖాన్ అందజేశారు. రెండో బహుమతి పవర్ క్లబ్ జట్టు రూ.7,000 (దాత: సర్పంచ్ వేల్పుల జయపాల్) అందుకుంది. కోవెలకుంట్ల జట్టు మూడో బహుమతి రూ. 6,000 ఎంపీపీ లాలం రమేష్), నాలుగో బహుమతి వెలుగోడు జట్టు రూ.5,000 (వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి), జూపాడుబంగ్లా జట్టు ఐదో బహుమతి రూ.4,000 (మోతుకూరు ఎం.సుధాకరరెడ్డి), ఆరో బహుమతి అబ్దుల్లాపురం జట్టు రూ.3,000 (ఆసిఫ్ అలి ఖాన్), నాగటూరు జట్టు ఏడవ బహుమతి రూ. 2,000 (జాకీర్ (జగ్గయ్య), నెరవాడ జట్టుకు ఎనిమిదో బహుమతి రూ. 1,000 (మొహమ్మద్ ఖాన్) దక్కించుకుంది. రఫా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఈ పోటీల పర్యవేక్షించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ఆత్మకూరు: పట్టణంలో రహదారి ప్రమాదాలు అధికం కావడంతో ఆత్మకూరు పోలీసులు వాటిని నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సోమవారం ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టణంతో పాటు ఆర్టీఓ, ఫారెస్టు చెక్‌పోస్టు, ఉర్దూ పాఠశాల, గీతాభవన్ హోటల్, శ్రీపతిరావుపేట క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లలు, స్టిక్కర్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పల్లె పల్లెల్లో సంక్రాంతి సంబరాలు


మిడుతూరులో ఉత్సవమూర్తులను గజవాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. మహిళలు పోటీ పడి ఇళ్ల ముందు రంగవల్లులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ముగ్గుల మధ్యలో బంతి పూలు, గొబ్బెమ్మలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని పద్మావతి హై స్కూలులో, పట్టణంలోని అర్బన్‌కాలనీ, ఏకలవ్య నగర్, గొల్ల పేటలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఆయాకాలనీల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆలయాల వద్ద సంక్రాంతి శోభ

కొత్తపల్లి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం, సోమవారం మండలంలోని కొలనుభారతిదేవి క్షేత్రం, జలాదీవాసం వీడుతున్న సంగమేశ్వరాలయాన్ని అధిక సంఖ్యలో సందర్శించుకున్నారు. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు, పెద్దలు కుటుంబ సమేతంగా తరలివచ్చి భక్తి పారవశ్యంతో పూజలు జరుపుకున్నారు.

ఘనంగా వేడుకలు

మిడుతూరు: అన్ని గ్రామాల్లో సంక్రాంతి పర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో అశ్వవాహనంపై పారువేట మండపానికి చేర్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేసి గ్రామంలోకి చేరుకున్న స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.